క్లుప్తంగా

నేడు గొండుపాలెంలో రెవెన్యూ సదస్సు

కె.కోటపాడు: గొండుపాలెంలో రెవెన్యూ సదస్సు సోమవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే సదస్సులో రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

మోదమాంబకు వెండి ఆభరణాల బహూకరణ



మోదమాంబకు వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

మాడుగుల రూరల్: ఎం. కోడూరు మోదమాంబ అమ్మవారికి దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. గ్రామానికి చెందిన పట్టాపు రమణబాబు, పట్టాపు కొండలరావు, పట్టాపు వరహామూర్తి, పట్టాపు మాణిక్యం, బైలపూడి వెంకట్రావు కుటుంబ సభ్యులు అరకేజీ వెండితో తయారు చేసిన వెండి ఆభరణాలను ఆదివారం గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తురువోలు హైస్కూలుకు ప్రింటర్ వితరణ



హెచ్ఎంకు ప్రింటర్ అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చీడికాడ: మండలంలోని తురువోలు ఉన్నత పాఠశాలకు 2010–11 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ప్రింటర్ వితరణగా ఇచ్చారు. ఆదివారం ఇక్కడ హైస్కూలులో వారంతా కలుసుకుని సందడి చేశారు. పాఠశాల ఆవరణలో కలియ తిరిగి ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఏటా పాఠశాలకు తమవంతుగా అవసరమైన సామగ్రిని అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రూ.25 వేల విలువ ప్రింటర్‌ను హెచ్ఎం రామకృష్ణకు అందించారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జి.పి.ఎ.నాయుడు పాల్గొన్నారు.

కె.జె.పురంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ జామి రమణబాబు

మాడుగుల రూరల్: కె.జె.పురం మేజర్ గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టే సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు సర్పంచ్ జామి రమణబాబు ఆదివారం ప్రారంభించారు. ఇక్కడ హౌసింగ్ కాలనీకి వెళ్లే రహదారిలో మళ్ల సత్తిబాబు ఇంటి వద్ద నుంచి దాడి రాము మందుల షాపు వరకు 500 మీటర్ల పొడవున సీసీ రోడ్డును నిర్మించనున్నారు. ఈ పనులకు గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కాళ్ల రాము, కాళ్ల అప్పలనాయుడు, వార్డు సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, ఆడారి శంకర్రావు, కాంట్రాక్టరు మళ్ల కన్నబాబు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సత్యవరం పొలాల్లో తడుస్తున్న వరి పనలు



దేవరాపల్లిలో పొలంలోనే మొలకెత్తిన ధాన్యపు గింజలు



ఆదరాబాదరాగా కుప్పలు పెడుతున్న రైతులు

అన్నదాతకు అపార నష్టం

- తుపాను వర్షాలతో పాడైన పంట
- పొలంలోనే మొలకెత్తిన ధాన్యం గింజలు
- నిలువునా నష్టపోయిన రైతులు
- అందని ప్రభుత్వ సహకారం



మొలకెత్తిన వరి పనలను చూపిస్తున్న మహిళా రైతు

మాడుగుల/దేవరాపల్లి: ఇటీవల కురిసిన తుపాను వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చాయి. పంట చేతికి అందివచ్చే సమయంలో కురిసిన వర్షాలకు పూర్తిగా తడిసి ముద్దయింది. కొన్ని గ్రామాల్లో కోసిన వరి పనలు తడిసిపోగా, మరి కొన్ని గ్రామాల్లో కుప్పలుగా పెట్టిన వరి చేను సైతం తడిసిపోయింది. దీంతో వరి పనల్లోని గింజలు మొలకెత్తడంతో అన్నదాత తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట కళ్ల ముందే తడిసిపోయి ధాన్యపు గింజలు మొలకెత్తడం చూసి బోరున విలపిస్తున్నారు. దేవరాపల్లి మండలం దేవరాపల్లి, పెదనందిపల్లి, కాశీపురం, కలిగొట్ల తదితర గ్రామాల్లో పంట తడిసిపోయింది. మాడుగుల మండలంలో 14 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేయగా, వరుస తుపాన్లకు సుమారు 8 వేల ఎకరాల్లో పంట పాడైందని రైతులు బోరుమంటున్నారు. ధాన్యం తడిసిపోవడంతో వంద ఎకరాల్లో మొలక వచ్చాయి. ఇంత నష్టం చేకూరిన ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని గుర్తించి, తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చేతికొచ్చిన పంట నాశనం



మొదట వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. తీరా పంట దశకు చేరుకున్నాక వరుస తుపాన్లు వల్ల చేతికందిన పంట నేల పాలైంది. పొలాల్లోనే ధాన్యం మొలకెత్తుతున్నాయి. ఆరుగాలం పండించిన పంట వృథా అయింది. చాలా మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వం పరిశీలించి రైతులను ఆదుకోవాలి. నా ఎకరా పొలంలో మొలకలు వస్తున్నాయి.

– చల్లా మహేష్, రైతు, సత్యవరం, మాడుగుల మండలం

రెండున్నర ఎకరాలు తడిచిపోయింది



ఇటీవల వర్షాలకు నా రెండున్నర ఎకరా పొలంలో పంట ఉండిపోయింది. వారం రోజులుగా వరి చేను తడిసి పోయింది. ఒడ్డుకు చేర్చిన సరే గింజ రాలిపోతోంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– సుంకర శ్రీనువాసరావు, రైతు, కింతలి, మాడుగుల మండలం

సరుగుడు వద్ద సండే సందడి



సరుగుడు జలపాతంలో జలకాలాట

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు ఆదివారం సందడి చేశారు. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తాండవ రిజర్వాయరు ప్రదేశంలో సందర్శకులు తాకిడి నెలకొంది. ఇక్కడ తాండవ అందాలను తిలకించి ప్రాజెక్టు దిగువున పార్కులో ఆట పాటలతో కాలక్షేపం చేశారు. రెండు జిల్లాల నుంచి సందర్శకులు వాహనాలపై రావడంతో తాండవ రిజర్వాయరు, సరుగుడు జలపాతానికి వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీ కనిపించింది.

రబీ వరి నారుమడులు సిద్ధం



సత్యవరంలో వరి నారుమడులు సిద్ధం చేసిన రైతు

మాడుగుల: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు మిగిలిపోయిన వరి పంటను యంత్రాలతో కోయిస్తున్నారు. మరలా వర్షాలు కురుస్తాయని బెంగతో ఒకేసారి కోత నూర్పిడి యంత్రాలతో కోతలు కోస్తున్నారు. ఖరీఫ్ వరి చేలు వరుస తుపానులకు దెబ్బతినడంతో మరో వైపు రబీకి వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలుకు చెరువులు, జలాశయాలలో సాగునీరు చేరడంతో రబీ సాగుపై దృష్టి సారించారు. గతంలో 3 వేలు ఎకరాలలో సాగు చేయగా, ఈసారి రబీకి 4 వేల ఎకరాల్లో పంట వేయడానికి సిద్ధమవుతున్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



పార్థసారథి స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం



పార్థసారథి స్వామిని అలంకరించిన దృశ్యం

మాడుగుల: అతి పురాతనమైన పార్థసారథి స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆదివారం తిరువీధి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. దీంతో గ్రామస్తులు ఎదురుగా వెళ్లి స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు. అనంతరం ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భోగి వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని ప్రధాన అర్చకుడు పార్థసారథాచార్యులు తెలిపారు.

చిత్రకారుడికి ఘన సన్మానం



సూర్యనారాయణను సన్మానిస్తున్న నిర్వాహకులు

చోడవరం: చిత్రకారుడు బొడ్డేడ సూర్యనారాయణను ఆదివారం నెల్లూరులో అమీర్‌పేట అకాడమీ ఘనంగా సత్కరించింది. ఎంతోమందిని చిత్రకారులుగా తీర్చిదిద్దడమే కాకుండా ఎన్నో చిత్రాలు గీసి పలువురి మన్ననలు పొందారు. మానవ భావోద్వేగాలు పలకించేలా కాన్వాస్‌పై అద్భుతంగా చిత్రాలు గీసేవారు. ఈయనకు అకాడమీ 9వ జాతీయ స్థాయి బాలల చిత్రకళల పోటీల్లో నెల్లూరు జిల్లా డీఈవో బాలాజీరావు బహుమతి ప్రదానం చేసి సత్కరించారు. ఈ గౌరవం పట్ల చోడవరం చిత్రకారులు హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు రాజు, ప్రసాదు, కొండలరావు, ప్రకాష్, కన్నయ్యశెట్టి అభినందనలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు షేక్ అబ్దుల్లా, సంధ్య రంగులు ఆనంద్‌రాజు, సుందర్‌బాబు, పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అనకాపల్లి: కూటమి పాలనలో విద్యుత్ చార్జీలు, నిత్యావసర సరకుల ధరలు ఇప్పటికే పెరిగిపోయాయని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి ఇప్పుడు మోయలేని భారాలు మోపుతుందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణమే తగ్గించాలని కోరారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పృథ్వీరాజ్

నర్సీపట్నం: పీఆర్టీయూ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, టౌన్ సీఐ గోవిందరావు ఆదివారం ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిస్ట్ డాక్టర్ రాహుల్ రోగులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కేర్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్, జనరల్ ఫిజీషియన్ రవితేజ, ఆర్థోపెడిక్ డాక్టర్ రఘు, క్యాన్సర్ డాక్టర్ ఎల్.పి.భాస్కర్ వైద్య సేవలు అందించారు. గుండె, క్యాన్సర్ లక్షణాలు గురించి వైద్యులు వివరించారు. శిబిరంలో 300 మందికి లివర్ ఫంక్షన్ టెస్టులు, కిడ్నీ, ఈసీజీ టెస్టులు ఉచితంగా చేశారు. యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్.సుగుణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ అల్లు అప్పారావు, నర్సీపట్నం, కొయ్యూరు, గొలుగొండ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వి.రమేష్, జి.శ్రీరామమ్మూర్తి, ఎ.రమణమూర్తి, వి.తలుపులు, జి.పంతులుబాబు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వి.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో రెల్లి కులస్తుల గర్జన



ఏఎల్‌పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న రెల్లి కులస్తులు

గొలుగొండ: రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం ఏఎల్‌పురంలో రెల్లి కులస్తుల గర్జన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టరు బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలతో నివాళులు అర్పించారు. రెల్లి సంఘం నేతలు యర్రంశెట్టి అప్పన్నబాబు, కోనా నారాయణరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల రెల్లి కులస్తులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రెల్లి కులస్తులకు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు సక్రమంగా అందలేదని, అన్ని రంగాల్లో వెనుకబడిన రెల్లి కులస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాతవరం, కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన రెల్లి కుల సంఘం నేతలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1977–79 బ్యాచ్ విద్యనభ్యసించిన విద్యార్థులు పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒక చోట చేరారు. కళాశాలలో జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు అందరు సరదాగా గడిపారు.

పీఏసీఎస్ పదవులపై భిన్నాభిప్రాయాలు

- సీనియర్లకు అవకాశం ఇవ్వాలని కూటమి నాయకులు డిమాండ్
- కె.జె.పురంలో సమావేశం రసాభాస



కె.జె.పురం పాల సొసైటీ భవనంలో కూటమి నాయకులు సమావేశం



సమావేశంలో అభ్యంతరం తెలుపుతున్న సీనియర్ నాయకుడు ఆళ్ల సంతోష్‌కుమార్

మాడుగుల రూరల్: పీఏసీఎస్ పదవులు త్వరలో భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో గ్రామాల్లో రాజకీయ వేడి అందుకుంది. ప్రతి సహకార సంఘానికి పర్సన్ ఇన్‌చార్జి, మరో ఇద్దరు డైరెక్టర్లను నామినేట్ చేస్తారు. ఈ పదవులు పంపకానికి సంబంధించి ఆదివారం సాయంత్రం ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కె.జె.పురం పాల సొసైటీ –1 మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు తమ అభిప్రాయాలు వెల్లబుచ్చారు. పర్సన్ ఇన్‌చార్జి పదవికి బీజేపీ సీనియర్ నాయకుడు పుట్టా వెంకటరామప్పారావు(రాంబాబు) పేరును టీడీపీ నాయకుడు పాలకుర్తి శ్రీనివాసరావు ప్రతిపాదించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అంగీకారం తెలిపారు. రాంబాబును కాదని టీడీపీ నాయకుడు శరగడం ఆదిబాబుకు ఇవ్వాలని, అతను రెండు సార్లు ఎంపీటీసీ సభ్యునిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారని ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు ప్రస్తావించారు. దీనిపై పలువురు కార్యకర్తలు అభ్యంతరం చెప్పగా, సీనియర్ నాయకుడు ఆళ్ల సంతోష్‌కుమార్, తదితరులు కల్పించుకుని సీనియర్ నాయకులకు పర్సన్ ఇన్‌చార్జిగా అవకాశం ఇవ్వాలన్నారు. టీడీపీ నుంచి పాలకుర్తి శ్రీనివాసరావు, నాచు సునీల్‌కుమార్‌లకు గానీ, బీజేపీ నుంచి పుట్టా వెంకట రామప్పారావుకుగానీ ఇచ్చినా అభ్యంతరం లేదని సమావేశంలో తేల్చిచెప్పారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. డైరెక్టరు పదవికి జనసేన పార్టీ నుంచి కాళ్ల హరిబాల పేరును ప్రతిపాదించారు. మరో డైరెక్టర్ పదవికి వంటర్లపాలెం నుంచి సిద్దాబత్తుల గోవిందరావు తనకు ఇవ్వాలని పట్టుబడ్డారు. ఆయనకు కాకుండా లెక్కల శ్రీనివాసరావుకు ఇవ్వాలని కొందరు నాయకులు సిఫార్సు చేశారు. దీనిపైన ఏకాభిప్రాయం కుదరలేదు. సీనియర్ నాయకులకు త్రిసభ్య కమిటీలో ప్రాధాన్యం ఇవ్వాలని సీనియర్ నాయకుడు పాలకుర్తి శ్రీనివాసరావు అభిప్రాయం వ్యక్తం చేశారు.

రాకపోకలు ఎలా?



వెదురుపల్లిలో గోతులతో ఆర్అండ్‌బీ రోడ్డు

నాతవరం: మండలంలో వెదురుపల్లి గ్రామం మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఇటీవల రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించారు. రోడ్డు పనులు చేయడం వదిలేశారు. దాంతో డ్రైనేజీలు ఎత్తులో రోడ్డు పల్లంగా ఉండటంతో ఏమాత్రం వర్షం పడిన నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతోంది. నీరు కారణంగా వచ్చిపోయే వాహనాలతో రోడ్డు మధ్యలో పెద్ద గోతులు పడి అధ్వానంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు కనీసం గోతులు పూడ్చినా సమస్య ఉండేది కాదని గ్రామస్తులు చెబుతున్నారు. డ్రైనేజీలు నిర్మించిన ఎలాంటి ఉపయోగం ఉండటం లేదని వాపోతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాలతో వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందనున్నట్లు కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.కె.జోష్ తెలిపారు. స్థానిక వేణు విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్, వేణు టీచర్, యువరాజ్ ఫౌండేషన్, ఓమ్నీ ఆర్కే ఆధ్వర్యంలో ఉచిత మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు ఉచితంగా బ్రెస్ట్ కేన్సర్ నిర్ధారిత పరీక్షలు చేశారు. 467 మందికి వివిధ వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందించారు. రోగులకు వేణు విద్యానికేత్ పాఠశాల సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తుల పంపిణీ చేస్తున్న అమ్మాణి

నర్సీపట్నం: యేరుషలేం ప్రార్థన మందిరంలో పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. ఆదివారం ఇక్కడ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిసెప్ డానియల్ పాస్టర్ యేసుక్రీస్తు గురించి వివరించారు. దైవజనులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని బిసెప్ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బిసెప్ డానియల్ సతీమణి అమ్మాణి పేదలకు దుస్తుల పంపిణీ చేశారు.